సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 5 । ఏప్రిల్ । 2024



అల్లాడుతున్న మూగజీవాలు

వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు తలమడుగు మండలంలో నిర్మించిన నీటి తొట్టీలు నిర్వహణ సరిగా లేక నిరుపయోగంగా మారాయి. దీంతో మూగజీవాలు నీటి కోసం అల్లాడుతున్నాయి. 9లో▸

రంజాన్ వేళలు

శుక్ర ఇఫ్తార్ 6:32

శని సహర్ 4:43

గరిష్టం/కనిష్టం 42.0/28.0

వాతావరణం

ఎండతీవ్రత కొనసాగుతుంది. పగటపూట అధికంగా వేడి, ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

'గిరి' గ్రామాల్లో మెరుగైన వైద్యం అందించాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి మనోహర్

నార్నూర్: గిరిజన గ్రామాల్లో మెరుగైన వైద్యం అందించాలని అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ మనోహర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైరిస్క్ ఉన్న గర్భిణులను గుర్తించి మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉందని, వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ ఆశ కార్యకర్త వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు తప్పకుండా ఉండాలన్నారు. సమావేశంలో డెప్యూటీ డీఎంహెచ్‌వో విజయ్ కుమార్, సీహెచ్‌వో లక్ష్మి, హెచ్ఈవో తులసిదాస్, హెల్త్ సూపర్‌వైజర్లు చరణ్‌దాస్, సత్తవ్వ, తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యలో మందిర నిర్మాణం చరిత్రాత్మకం

ఆదిలాబాద్: అయోధ్యలో జరిగిన రామ మందిర నిర్మాణం చరిత్రాత్మకమని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రిక్షాకాలనీలో శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అయోధ్యలో శ్రీబాలరాముని విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాన్ని దేశమంతా భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించుకున్నారన్నారు. నేడు అదే స్ఫూర్తితో ప్రతి ఊరిలో రామ మందిర నిర్మాణాలు జరుగుతుండడం గొప్ప విషయమన్నారు. వేడుకల్లో మాజీ మంత్రి జోగు రామన్న, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ సైతం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి భారీ మొత్తంలో ఆర్థిక సహకారం అందించిన సుభద్రబాయిని సన్మానించారు. వార్డు కౌన్సిలర్ ఆవుల వెంకన్న, బీజేపీ నాయకులు ఆదినాథ్, విజయ్, అశోక్, సూర్య, శివ, భూమన్న, బీఆర్ఎస్ నాయకులు గణేశ్, రాం కుమార్, ధమ్మపాల్ పాల్గొన్నారు.

అయోడిన్ లోపానికి చెక్



విద్యార్థిని పరీక్షిస్తున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

- జిల్లాలోని 21 పీహెచ్‌సీల పరిధిలోని 30 గ్రామాల్లో సర్వే
- 2700 మంది విద్యార్థులకు థైరాయిడ్ పరీక్షలు
- 10 శాతం మంది యూరిన్ శాంపిల్ సేకరణ
- లోపం ఉన్నవారికి చికిత్స

ఆదిలాబాద్‌టౌన్: మానవుని జీవనంలో అయోడిన్ పాత్ర ఎంతో ఉంది. చిన్నతనంలోనే అయోడిన్ లోపాన్ని గుర్తిస్తే దాని నివారణకు చర్యలు చేపట్టవచ్చు. ఇందుకోసం ప్రభుత్వం విద్యార్థుల్లో అయోడిన్ లోపాన్ని గుర్తించేందుకు థైరాయిడ్ పరీక్షలు నిర్వహిస్తోంది. చాలా మంది విద్యార్థుల్లో థైరాయిడ్ లోపం కారణంగా అనేక పరిణామాలు ఎదుర్కొంటున్నారు. బాలికలు పెళ్లయిన తర్వాత గర్భం దాల్చకపోవడం, శిశువు తక్కువ బరువుతో జన్మించడం, కండరాలు బిగుసుకు పోవడం, బుద్ధిమాంద్యం చురుగ్గా పనిచేయకపోవడం, చర్మం పొడిబారడం, జుట్టురాలడం, బాలికల్లో రుతుక్రమం సరిగ్గా ఉండకపోవడంతో పాటు అనేక రుగ్మతలకు గురవుతారు. పురుషుల్లోనైతే మగతనం తగ్గడం, మరుగుజ్జుతనం ఏర్పడటం, తదితర సమస్యలు ఎదురవుతాయి. వీటన్నింటికీ చెక్ పెట్టేందుకు వైద్యారోగ్య శాఖ సర్వే చేపడుతోంది. 5 నుంచి 15 సంవత్సరాల వయస్సుగల విద్యార్థులకు ఈ పరీక్షలు చేస్తున్నారు.

21 పీహెచ్‌సీల పరిధిలో..

నేషనల్ అయోడిన్ డెఫిసియన్సీ డిసాస్టర్ కంట్రోల్ రూమ్ ప్రోగ్రాంలో భాగంగా జిల్లాలోని 21 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 30 గ్రామాల్లోని పాఠశాలల్లో శాంపిల్ సర్వే చేస్తున్నారు. ఒక్కో గ్రామంలో 90 మంది విద్యార్థులను ఎంపిక చేసి థైరాయిడ్ పరీక్షలు చేస్తారు. 90 మంది విద్యార్థుల్లో 18 మంది ఇంట్లో వాడే ఉప్పును, మరో 9 మంది విద్యార్థుల మూత్ర సేకరణ చేపట్టి పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపిస్తారు. ఈ కార్యక్రమాన్ని గురువారం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ ప్రారంభించారు. పలు గ్రామాల్లో జరిగిన సర్వేను పరిశీలించారు.

మినరల్స్‌లో కూడా అయోడిన్..

నిత్యజీవితంలో ఆరోగ్యంగా జీవించడానికి కావాలిసిన మినరల్స్‌లో అయోడిన్ కూడా ఒకటి. అయోడిన్ ఒక సూక్ష్మపోషకం. ప్రతీరోజు మన శరీరానికి ఇది ఎంతో అవసరం. వయస్సును బట్టి తక్కువ మోతాదులో అయోడిన్ తీసుకోవాలి. అయోడిన్ అంటేనే చాలా మంది కేవలం ఉప్పులోనే ఉంటుందనుకుంటారు. కానీ క్రాన్‌బెర్రీలు, ఆలుగడ్డలు, స్ట్రాబెర్రీలు, మొక్కజొన్న, అరటిపండ్లు, బీన్స్, పాలకూర, కొబ్బరినూనె, బ్రోకొలి, హిమాలయన్ సాల్ట్, సోంపు గింజల ఆకు, సముద్రపు ఉప్పు, సముద్రపు చేపలు, పెరుగు, కోడిగుడ్లు, టర్కీ మాంసంలో సైతం అయోడిన్ అధికంగా ఉంటుంది.

ఎంపికైన గ్రామాలు ఇవే..

జిల్లాలోని 21 పీహెచ్‌సీల పరిధిలో 30 గ్రామాలను ఎంపిక చేశారు. అంకోలి పీహెచ్‌సీ పరిధిలో దస్నాపూర్, మావల, రాంనగర్, యాపల్‌గూడ, గుడిహత్నూర్ పరిధిలో శాంతపూర్, గిమ్మ పీహెచ్‌సీలో, జైనథ్, తలమడుగు, తాంసి పీహెచ్‌సీలతో పాటు బేల పీహెచ్‌సీలో సిర్సన్న, భీంపూర్ పీహెచ్‌సీలో అర్లి, సొనాల పీహెచ్‌సీలో సొనాల, బోథ్, కరత్వా డ, ఇచ్చోడ పీహెచ్‌సీ పరిధిలో ఇచ్చోడ, బోరిగామ, నర్సాపూర్ పీహెచ్‌సీ పరిధిలో సిరిచెల్మ, నేరడిగొండ పీహెచ్‌సీలో, దంతన్‌పల్లి పీహెచ్‌సీలో, హస్నాపూర్ పీహెచ్‌సీ పరిధిలోని చందూరి, శ్యాంపూర్ పీహెచ్‌సీ పరిధిలో సాలెవాడ(బి), ఇంద్రవెల్లి పీహెచ్‌సీలో, ఈశ్వర్‌నగర్, పిట్టబొంగరం పీహెచ్‌సీలో ద స్నాపూర్, వాల్గొండ, గాదిగూడ పీహెచ్‌సీలో, నా ర్నూర్ పీహెచ్‌సీ పరిధిలో నార్నూర్, కొత్తపల్లి, ఆది లాబాద్ పట్టణంలోని హమాలీవాడ పీహెచ్‌సీలో, పుత్లీబౌళి పీహెచ్‌సీల్లో ఈ పరీక్షలు చేయనున్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



అయోడైజ్డ్ ఉప్పును వాడడంతో థైరాయిడ్‌ను నివారించవచ్చు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం శాంపిల్ సర్వే చేపడుతోంది. జిల్లాలోని 2,700 మంది విద్యార్థుల మూత్ర పరీక్షలతో పాటు వారి ఇండ్లలో వాడే ఉప్పు శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపిస్తాం. ఎవరికైనా అయోడిన్ లోపం ఉంటే చికిత్స అందిస్తాం.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

ఇన్‌చార్జీలకు సవాలే

- పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థితో పాటు వారికి గెలుపు ప్రతిష్టాత్మకమే
- కాంగ్రెస్‌కు సీతక్క.. బీజేపీకి పాయల్ శంకర్
- అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమావేశాల నిర్వహణలో ముందంజ
- వెనుకబడ్డ బీఆర్ఎస్
- ఇప్పటికీ ఇన్‌చార్జీ నియామకం.. సమావేశాల ఊసే లేదు



సీతక్క, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి



పాయల్ శంకర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే

సాక్షి, ఆదిలాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థితో పాటు ఇన్‌చార్జీగా వ్యవహరిస్తున్న నేతలకు కూడా గెలుపు ప్రతిష్టాత్మకంగా మారింది. కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా రాష్ట్ర మంత్రి సీతక్క వ్యవహరిస్తుండగా బీజేపీ ఇన్‌చార్జిగా ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఇప్పటికీ ఇన్‌చార్జీ నియామకం చేపట్టలేదు. బీజేపీ సిట్టింగ్ సీటులో మళ్లీ గెలుస్తామన్న ధీమా వ్యక్తం చేస్తుండగా కాంగ్రెస్ ఈ సెగ్మెంట్‌లో పాగా వేస్తామన్న విశ్వాసం వ్యక్తం చేస్తోంది. బీఆర్ఎస్ ఈ పార్లమెంట్ నియోజకవర్గంలో ఓటర్ల ఆదరణ తమకే అమితంగా ఉందంటూ విజయంపై భరోసాగా ఉంది. మొత్తంగా ఈ ఎన్నికలు రసవత్తరంగా సాగనున్నాయి.

బీజేపీ, కాంగ్రెస్ స్పీడ్..

బీజేపీ అభ్యర్థిగా గొడం నగేష్‌ను ఖరారు చేయడంతో పాటు పార్లమెంట్ ఇన్‌చార్జిగా ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను నియమించడంలో మిగితా పార్టీలకంటే ముందుంది. ఈ పార్టీ సెగ్మెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇప్పటికే సమావేశాలు పూర్తి చేసింది. ఇక మండలాల వారీగా సమావేశాల నిర్వహణ ప్రారంభించింది. కాంగ్రెస్ ఆసిఫాబాద్ నియోజకవర్గం మినహా మిగితా అన్ని నియోజకవర్గాల్లో సమావేశాలు పూర్తి చేసింది. ఈనెల 7న అక్కడ కూడా సమావేశం నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే బీజేపీ నియోజకవర్గాల వారీగా సమావేశాల నిర్వహణలో అభ్యర్థితో పాటు ఇన్‌చార్జీ పాయల్ శంకర్ ఆదిలాబాద్‌లో మినహా మిగితా నియోజకవర్గాల్లో పాల్గొనడం లేదు. అయితే కాంగ్రెస్‌లో అభ్యర్థితో పాటు ఇన్‌చార్జీ సీతక్క ప్రతీ నియోజకవర్గ సమావేశంలో పాల్గొంటున్నారు.

ఇన్‌చార్జీ నియామకమే లేదు..

బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కును ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు పార్లమెంట్ ఇన్‌చార్జీగా పార్టీ పరంగా ఎవరినీ నియమించలేదు. అయితే మాజీ మంత్రి జోగు రామన్నను ఇన్‌చార్జీగా నియమించే అవకాశం ఉందని పార్టీలో ప్రచారం సాగుతోంది. ఈ నెల 5 తర్వాత ఈ విషయంలో నిర్ణయం వెలువడవచ్చని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు కేవలం బోథ్ నియోజకవర్గంలోనే ఈ పార్టీ సమావేశం జరిగింది. అసెంబ్లీ ఎన్నికల్లో బోథ్, ఆసిఫాబాద్‌లో మినహా మిగితా అన్నిచోట్ల ఓటమి చవిచూసింది. ఈ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం ఓట్ల పరంగా మిగితా అన్ని పార్టీలకంటే బీఆర్ఎస్ ముందుంది. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో పలువురు సీనియర్ నాయకులు పార్టీని వీడడం, నియోజకవర్గాల్లో క్యాడర్‌కు దిశానిర్దేశం చేసే నేతలు లేకపోవడం మైనస్‌గా మారుతోంది. ఈ నేపథ్యంలో పార్టీ ఎలాంటి ఎత్తుగడలతో ముందుకెళ్తుందనేది వేచి చూడాల్సిందే.

పోస్టల్ బ్యాలెట్ సద్వినియోగం చేసుకోవాలి

- ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షిషా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

ఎదులాపురం: అత్యవసర సేవా శాఖల ఉద్యోగులకు కల్పించిన పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షిషా అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గురువారం పోస్టల్ బ్యాలెట్‌పై సంబంధిత శాఖల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎసెన్షియల్ సర్వీస్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఇండియన్ రైల్వేస్, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో, విద్యుత్‌శాఖ, ఆరోగ్యం కుటుంబ సంక్షేమ శాఖ, రాష్ట్ర రవాణా సంస్థ, ఆహారం, పౌర సరఫరాల శాఖ, ఎస్ఎస్ఎల్, అగ్నిమాపక సేవా ఉద్యోగులు, పోల్ డే కవరేజ్ కోసం ఈసీఐ ద్వారా అధికారం పొందిన మీడియా మిత్రులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకునే సౌకర్యం కల్పించామన్నారు. ఇందుకు ఫారం 12–డిలో వివరాలు పూరించి ఈనెల 15లోగా అందజేయాలన్నారు. సమావేశంలో జిల్లా పౌర సంబంధాల అధికారి తిరుమల, జిల్లా వైద్యాధికారి నరేందర్, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి హరీంద్ర కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, డీఎం సుధారాణి, ఫైర్ ఆఫీసర్ కృష్ణమూర్తి, జనరల్ మేనేజర్ దేవిదాస్, రైల్వే స్టేషన్ మాస్టర్ కుముద్, ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మార్కెట్ యార్డుల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జొన్న కొనుగోలుపై వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, మార్క్‌ఫెడ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జొన్న కొనుగోలుకు సంబంధించి ఎకరాకు 8.85 క్వింటాళ్లు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. 12 క్వింటాళ్లు కొనుగోలు చేసేవిధంగా అనుమతి ఇవ్వాలని ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిపారు. రైతులు పంటలను ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దన్నారు.

బాధితులకు అండగా సైబర్ వారియర్స్

- ఎస్పీ గౌస్ ఆలం



సైబర్ వారియర్స్‌తో మాట్లాడుతున్న ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: సైబర్ క్రైమ్ బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రతీ పోలీస్ స్టేషన్‌కు సైబర్ వారియర్స్‌ను కేటాయించినట్లు ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. గురువారం సైబర్ వారియర్స్‌కు ప్రత్యేకంగా ఒక సెల్‌ఫోన్, సిమ్ కార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 ఫోన్ నంబర్‌కు, ఎన్‌సీఆర్‌బీ పోర్టల్‌లో, సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో గానీ సంప్రదించాలని సూచించారు. సైబర్ నేరం ద్వారా మోసపోయిన డబ్బును త్వరగా ఇప్పించే విధంగా నూతన పద్ధతిని సైబర్ వారియర్స్‌కు వివరించామన్నారు. పూర్తి అవగాహనతో కోర్టు ద్వారా వీలైనంత త్వరగా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఇదివరకే సైబర్ నేరగాళ్ల ద్వారా మోసపోయిన వ్యక్తులు ఎవరైనా ఉంటే డబ్బులు తిరిగి వచ్చే విధంగా సైబర్ వారియర్స్ కృషి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆపరేషన్ సురేందర్‌రావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సైబర్ సెల్ ఇన్‌చార్జి సింగజీవార్ సంజీవ్ కుమార్, ఎంఏ రియాజ్, జిల్లా సైబర్ సెల్ వారియర్స్ పాల్గొన్నారు.

ప్రణాళికతో తాగునీరు సరఫరా చేయాలి

ఎదులాపురం: తాగునీటి సరఫరా కార్యాచరణను రూపొందించి రానున్న రెండు నెలలు పక్కా ప్రణాళికతో గ్రామాలకు తాగునీరు సరఫరా చేయాలని ప్రత్యేకాధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తాగునీటి సరఫరాపై కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా , ట్రెయిని కలెక్టర్ వికాస్ మహతో, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల వారీగా నియమించిన ప్రత్యేక అధికారులు ప్రతీరోజు పర్యవేక్షించాలన్నారు. మూడు రోజులకోసారి నీటి సరఫరా అవుతున్న హాబిటేషన్ల వివరాలు సమర్పించాలన్నారు. నీటి సమస్య ఎక్కువగా ఉన్నచోట ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలన్నారు. ఆదిలాబాద్ రూరల్, తాంసి, తలమడుగు, ఇంద్రవెల్లి, బోథ్, బజార్ హత్నూర్, తదితర మండలాల్లో సమస్య ఎక్కువగా ఉన్న చోట ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

హడలెత్తిస్తున్న ఏనుగు

- 24 గంటల వ్యవధిలో గజరాజు దాడిలో ఇద్దరు మృతి
- ఐదు మండలాల్లో 144 సెక్షన్ విధింపు
- అడుగడుగునా అటవీశాఖ వైఫల్యం
- సమీప గ్రామాలను అప్రమత్తం చేస్తున్న అధికారులు



కొండపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న అటవీ, పోలీసు అధికారులు

చింతలమానెపల్లి: కుమురంభీం జిల్లా ప్రజలను గజరాజు హడలెత్తిస్తున్నాడు. 24 గంటల వ్యవధిలోనే ఇద్దరు రైతులు ఏనుగు దాడిలో మృత్యువాత పడటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆచూకీ చిక్కకుండా తిరుగుతున్న ఏనుగు గ్రామీణులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. రెండేళ్ల క్రితం ఇదే ప్రాంతంలో దహెగాం, కొండపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరిని పెద్దపులి హతమార్చగా.. ఇప్పుడు ఏనుగు రూపంలో మృత్యువు వెంటాడుతోందని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

ఇద్దరు రైతుల మృతి..

బూరెపల్లి సమీపంలోని ప్రాణహిత నదిలో బుధవారం తెల్లవారుజామున ఏనుగును కొంతమంది గ్రామస్తులు గమనించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. సమాచారాన్ని విశ్వసించని అటవీ అధికారులు ఏనుగును నియంత్రించకపోవడంతో అది నది దాటి చింతలమానెపల్లి మండలంలోకి ప్రవేశించింది. ఉదయం 11 గంటల సమయంలో బూరెపల్లి సమీపంలోని వ్యవసాయ భూముల వద్దకు వచ్చిన ఏనుగు అక్కడే మిరపతోటలో పని చేస్తున్న రైతు అల్లూరి శంకర్‌పై దాడి చేసి చంపేసింది. ఆందోళనకు గురైన గ్రామస్తులు ఏనుగును తరిమేందుకు ప్రయత్నించారు. అక్కడికి చేరుకున్న అటవీశాఖ అధికారులు దానిని అనుసరించగా.. గంగాపూర్, ఖర్జెల్లి గ్రామాల పక్కన ఉన్న ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టు కాలువ పక్క నుంచి రుద్రాపూర్ గ్రామం వద్దకు చేరుకుంది. అక్కడి నుంచి అధికారులు ఏనుగు కదలికలను గుర్తించలేదు. మళ్లీ గురువారం తెల్లవారుజామున పెంచికల్‌పేట్ మండలం కొండపెల్లి గ్రామానికి చెందిన కారు పోశన్న(60)పై దాడి చేసి చంపింది. అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఎల్కరి సుధాకర్‌ను వెంబడించగా తప్పించుకున్నాడు. ఈ క్రమంలో ఏనుగు పలువురికి చెందిన తోటలు, పంటలు ధ్వంసం చేసింది. చింతలమానెపల్లి మండలం నుంచి బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాల్లో సంచరించింది. ఈమండలాలతో పాటు పక్కన ఉన్న కౌటాల, దహెగాం మండలాలు కలిపి రెండు రోజులుగా ఏనుగు ఐదు మండలాల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.

అటవీశాఖపై విమర్శలు


బూరెపల్లి వద్ద ఏనుగు సంచరిస్తున్న సమాచారాన్ని అటవీశాఖకు చేరవేసినా అధికారులు పట్టించుకోలేదని స్థానికుల నుంచి విమర్శలు వస్తున్నాయి. సరైన సమయంలో స్పందించని కారణంగానే అల్లూరి శంకర్ ఏనుగు దాడిలో మరణించాడని ఆరోపిస్తున్నారు. ఒకరిపై దాడి చేసిన అనంతరం స్వయంగా జిల్లా అటవీ అధికారి పర్యవేక్షణలో ఉండగానే పెంచికల్‌పేట్ మండలంలోని కొండపల్లి వద్ద మరొకరు ఏనుగు దాడిలో మృతి చెందడంపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. పరిసర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయడంలో అటవీశాఖ నిర్లక్ష్యం వహించిందని, గోప్యత పాటించడంతోనే ప్రమాదాలు పెరుగుతున్నాయని మండిపడుతున్నారు. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో కొన్ని నెలల క్రితం అటవీ అధికారుల నిర్లక్ష్యంతో రెండు పులులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో అధికారులను బాధ్యులు చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు పలువురిపై వేటు వేశారు.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ

ఎస్పీ సురేశ్‌కుమార్, అటవీ కన్జర్వేటర్ శాంతారాం, జిల్లా అటవీ అధికారి నీరజ్ టోబ్రివాల్, డీఎస్పీ కరుణాకర్ స్వయంగా ఆయా మండలాలలో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. అధికారులు చింతలమానెపల్లి, కౌటాల, బెజ్జూర్, పెంచికల్‌పేట్, దహెగాం మండలాలలో 144 సెక్షన్ విధించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. సోషల్ మీడియా ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

లోడుపల్లి అడవుల్లోకి గజరాజు

పెంచికల్‌పేట్(సిర్పూర్): పెంచికల్‌పేట్ మండలం కొండపల్లిలో గురువారం వేకువజామున రైతును చంపిన ఏనుగు మళ్లీ రాత్రి 8 గంటలకు బెజ్జూర్ నుంచి పెంచికల్‌పేట్ వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు కొండపల్లి టర్నింగ్ వద్ద ఎదురొచ్చింది. ఘటనా స్థలానికి చేరుకున్న పీసీసీఎఫ్ శాంతారాం, డీఎఫ్‌వో నీరజ్ కుమార్ ఏనుగు సంచారాన్ని నిర్ధారించారు. లోడుపల్లి అడవుల్లోకి వెళ్లిందని తెలిపారు. అటవీశాఖ అధికారులు ఇచ్చిన సమాచారంతో ఎస్సై కొమురయ్య ఆధ్వర్యంలో పెంచికల్‌పేట్– సలుగుపల్లి రహదారిలో రాకపోకలను నిలిపివేశారు.




రహదారి మీదుగా వెళ్తున్న ఏనుగు

ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణకు..

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోకి ప్రవేశించిన ఏనుగు ఎక్కడి నుంచి వచ్చింది అనే విషయాన్ని అటవీశాఖ ధ్రువీకరించడం లేదు. ఇప్పటివరకు కచ్చితమైన సమాచారం లేకపోవడంతో అధికారులు ఎలాంటి వివరాలు వెల్లడించడం లేదు. కాగా గత మంగళవారం ఏనుగు బూరెపల్లి వద్ద ప్రాణహిత నదికి అవతలి వైపు ఉన్న చౌడంపల్లి అటవీ ప్రాంతంలో సంచరించినట్లు అక్కడి ప్రజలు తెలిపారు. చింతలమానెపల్లి మండలానికి సుమారు 70 కిలోమీటర్ల దూరంలోని గడ్చిరోలి జిల్లా రేపన్‌పల్లి రేంజ్ పరిధిలోని కమలాపూర్‌లో ఏనుగుల సంరక్షణ కేంద్రం ఉంది. అక్కడి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఏనుగు అడవుల్లో సంచరించేది. దక్షిణ గడ్చిరోలి ప్రాంతంగా పిలిచే మాలెవాడ, మురుంగావ్ ప్రాంతం ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రకు సరిహద్దుగా ఉంది. ఛత్తీస్‌గఢ్‌లోని దట్టమైన అభయారణ్యం ఒడిశా రాష్ట్రంలోని అటవీ ప్రాంతంతో కలిసి ఉంటుంది. కొన్నేళ్లుగా ఇక్కడి ప్రాంతంలో ఏనుగుల సంచారం ఉంది. మూడేళ్ల క్రితం మాలెవాడ అటవీ ప్రాంతానికి 25 నుంచి 30 ఏనుగుల బృందం వచ్చినట్లు అక్కడి అటవీ అధికారులు గుర్తించారు. ఈ ప్రాంతంలోని ఏనుగుల గుంపు నుంచే ఓ ఏనుగు ఇక్కడికి వచ్చినట్లుగా తెలుస్తోంది. గడ్చిరోలి నుంచి వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న ధనోరాలో ఈ ఏనుగుల గుంపు కొద్ది నెలలుగా తీవ్ర విధ్వంసం సృష్టిస్తున్నట్లు అక్కడి అధికారులు తెలిపారు. ఓ డ్రైవర్ సహా మరో ముగ్గురిపై దాడి చేసి చంపేశాయి. ఈ ఏనుగులు కర్ణాటక రాష్ట్రం నుంచి అటవీ ప్రాంతం గుండా గడ్చిరోలిలోని మాలెవాడ అటవీ ప్రాంతానికి చేరుకున్నట్లు వారు చెబుతున్నారు.

నా వెంట పడింది



ఉదయం పూట కొండపల్లి సమీపంలో వాకింగ్‌కు వెళ్లా. ఏనుగు ఘీంకరించిన శబ్దం వినిపించింది. దూరంగా ఉన్న ఇద్దరు మిత్రులను అప్రమత్తం చేస్తూ అరవడంతో ఏనుగు నా వెంట పడింది. పరుగెత్తి తప్పించుకున్నా. తర్వాత ఏనుగు ఉన్న స్థలంలో చూడడానికి వెళ్లగా అక్కడ కారు పోశన్న మృతదేహం కనిపించింది.

– ఎల్కరి సుధాకర్, పెంచికల్‌పేట్

క్లుప్తంగా

ఆఫీసులో వేడుకలపై మెమో

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం పైన గల మెప్మా ఆఫీస్‌లో ఈ నెల 2న డీఎంసీ సుభాష్ బర్త్ డే వేడుకలను నిర్వహించడం వైరల్‌గా మారింది. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కు ఫిర్యాదు అందడంతో కమిషనర్‌కు ఆదేశించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ సీవీఎస్ రాజు డీఎంసీ, టీఎంసీ, ఇతర సిబ్బందికి గురువారం మెమోలు జారీ చేశారు. ఆఫీస్ సమయంలో అనాధికారికంగా వేడుకలను నిర్వహించడంపై మూడు రోజుల్లో వివరణ సమర్పించాలని సూచించారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మూగజీవాలను తరలిస్తున్న వాహనాలు పట్టివేత



వాహనాల్లో తరలిస్తున్న పశువులు

నేరడిగొండ: మూగజీవాలను వాహనాల్లో అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఆదిలాబాద్ వైపు నుంచి నిర్మల్ వెళ్తున్న రెండు బొలెరో వాహనాల్లో ఆవులను తరలిస్తున్నారనే సమాచారం మేరకు గురువారం ఉదయం రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఒక వాహనంలో 6 ఆవులు, మరో వాహనంలో 5 ఆవులతో పాటు 4 దూడలను తాళ్లతో కట్టి తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్‌లోని నటరాజ్ థియేటర్ ప్రాంతంలో బుధవారం రాత్రి పేకాట ఆడుతుండగా ఐదుగురిని పట్టుకున్నట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పక్కా సమాచారం మేరకు దాడిచేసి ఐదుగురు పేకాటారాయుళ్లను పట్టుకోవడం జరిగిందన్నారు. వారి నుంచి రూ.98,170 నగదుతో పాటు పేకాట ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వృద్ధాశ్రమంలోని వృద్ధుడి మృతి

- అంత్యక్రియలు చేసిన రెడ్‌క్రాస్ సభ్యులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీశ్రీనగర్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న కాసిపేట మండలం సోమగూడెంకు చెందిన గడ్డం మల్లయ్య(80) అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. దీంతో రెడ్‌క్రాస్ సభ్యులు అంత్యక్రియలను నిర్వహించారు. మృతుడి బంధువులు, మాజీ సర్పంచ్ వేముల కృష్ణల సమక్షంలో రెడ్‌క్రాస్ చైర్మన్ కె.భాస్కర్ రెడ్డి, వి.మధుసూదన్ రెడ్డి, కోశాధికారి కే.సత్యపాల్ రెడ్డి, వృద్ధాశ్రమం ఇన్‌చార్జి సత్యనారాయణరావు, నిర్వాహకులు సదానందం పాల్గొన్నారు.

ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఇలా..

- ఉమ్మడి జిల్లాలో 10,489 మందికి ఎన్నికల విధులు
- పూర్తయిన తొలివిడత శిక్షణ
- వీరికి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే అవకాశం



శిక్షణ పొందుతున్న ఉద్యోగ ఉపాధ్యాయులు (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: జిల్లాలో లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ కసరత్తు శరవేగంగా కొనసాగుతోంది. అధికార యంత్రాంగం పోలింగ్ కోసం అన్నిరకాల ముందస్తు ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఎన్నికల నిర్వహణలో ప్రధాన భూమిక పోషించే ఉద్యోగ, ఉపాధ్యాయులకు తొలివిడత శిక్షణ కూడా గురువారం నాటికి పూర్తయింది. ఎన్నికల విధులకు హాజరుకానున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోనున్నారు. ఇందుకు కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు విడుదల చేసింది. పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఎంపిక చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల్లో ఓటు వేయాల్సి ఉంటుంది.

పోస్టల్ బ్యాలెట్ వినియోగం ఇలా....

పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు ఫారం నంబర్ -12 ఇప్పటికే శిక్షణ కొనసాగుతున్న కేంద్రాల్లో అందజేశారు. అందులో వారు ఎక్కడ ఓటు వేయాలో ఎంచుకోవాలని సూచించింది. తాము ఓటరుగా నమోదై ఉన్న నియోజకవర్గం లేదా విధులు నిర్వర్తించే నియోజకవర్గం ఎంపిక చేసుకోవచ్చని పేర్కొంది. ఉద్యోగి పేరు, గుర్తింపు సంఖ్య, హోదా, శాఖ, మొబైల్ నెంబరు, పనిచేస్తున్న నియోజకవర్గం, సొంత నియోజకవర్గం, ఓటరు జాబితాలో సంఖ్య, గుర్తింపు కార్డు సంఖ్య వివరాలను ఫారం నెంబర్ -12 లో పొందుపరచాలని పేర్కొంది. పోస్టల్ ఓటు వేసే ఉద్యోగ ఉపాధ్యాయుల కోసం ఫెసిలిటేషన్ కేంద్రాలను కార్యాలయాల్లో ఏర్పాటు చేసింది. పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునే వారికి రాష్ట్ర ప్రభుత్వం ఒకరోజు ప్రత్యేక సాధారణ సెలవు దినాన్ని కూడా మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలో..

ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలో విధులు నిర్వహించాల్సిన ఎన్నికల ఉద్యోగులకు ఇప్పటికే తొలి విడత శిక్షణ పూర్తి కాగా వారంతా పోస్టర్ బ్యాలెట్ వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పార్లమెంటు పరిధిలోకి వచ్చే నిర్మల్, ముధోల్, బోథ్, ఆదిలాబాద్, ఖానాపూర్, ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల పరిధిలో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లోని 2,111 పోలింగ్ కేంద్రాలకు మొత్తం 10,489 మంది ఉద్యోగులు ఎన్నికల విధులు నిర్వహించనున్నారు. ఇందులో 55 ప్రభుత్వ శాఖల ఉద్యోగులను ఎంపిక చేశారు. ఎన్నికల నిర్వహణలో వీరంతా భాగస్వాములు కానున్నారు. పీవో, ఏపీఓ, ఓపీఓల కోసం ఆయాశాఖల్లో పని చేస్తున్న వారిని సీనియారిటీని బట్టి నియమించారు.

కేంద్ర ఎన్నికల సంఘం లోగో(ఫైల్)

నియోజకవర్గాల్లో సిబ్బంది వివరాలు..

నియోజక వర్గం	పోలింగ్ కేంద్రాలు	సిబ్బంది
నిర్మల్	306	1,554
ఖానాపూర్	305	1,555
ముధోల్	311	1,584
బోథ్	302	1,472
ఆదిలాబాద్	290	1,412
ఆసిఫాబాద్	304	1,480
సిర్పూర్	293	1,432
మొత్తం	2,111	10,489

ఒక్కో పోలింగ్ కేంద్రానికి నలుగురు...

ఒక్కొక్క పోలింగ్ కేంద్రానికి నలుగురు చొప్పున సిబ్బందిని నియమించనున్నారు. మరో 20 శాతం మంది ఉద్యోగులు రిజర్వులో ఉంచేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

అటవీశాఖలో వన్ నేషన్ వన్ పర్మిట్ నిబంధన



మాట్లాడుతున్న సీసీఎఫ్ శరవనన్

నిర్మల్‌చైన్‌గేట్: అటవీ శాఖలో రాష్ట్రవ్యాప్తంగా వన్ నేషన్ వన్ పర్మిట్ అనే నిబంధనలను అమలు చేస్తున్నట్లు బాసర సర్కిల్ సీసీఎఫ్ శరవనన్ అన్నారు. గురువారం నిర్మల్ అటవీశాఖ కార్యాలయంలో సామిల్ యజమానులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కర్ర కొనుగోలు చేసిన వారికి సామిల్ యజమానులే పర్మిట్ ఇచ్చేవారని, ఇప్పుడు ఆ పద్ధతి లేదన్నారు. సామిల్ యజమానులు కర్రను విక్రయించినప్పుడు అనుమతుల కోసం ఇన్‌లైన్ లోనే దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. రైతులు తమ పంట పొలాలలోని టేకు, ఇతర చెట్లను తొలగించాలన్న అన్‌లైన్‌లో అటవీ శాఖ అనుమతులు పొందాల్సి ఉంటుందన్నారు. సామిల్ యజమానులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా వేసవికాలంలో అడవులకు నిప్పు పెట్టడం ప్రమాదకరమని పశువుల కాపర్లు, ఇప్పపువ్వు సేకరణ కోసం వెళ్లేవారు, ఇతరత్రా పనుల కోసం అడవికి వెళ్లేవారు అడవులకు నిప్పు పెడుతున్నారని, దీనిపై స్థానిక అటవీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించి నిప్పు పెట్టడాన్ని సమూలంగా నిర్మూలించాలన్నారు. ఈ సమావేశంలో నిర్మల్ డీఎఫ్ఓతో పాటు జిల్లా అటవీ అధికారులు పాల్గొన్నారు.

బీజేపీతో ఆదివాసీలకు ముప్పు

- కొలాం హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సొనేరావ్



సమావేశంలో మాట్లాడుతున్న సొనేరావ్

ఆదిలాబాద్‌రూరల్: ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అభ్యర్థికి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతు ఇస్తే ఆ పార్టీతో ఆదివాసీలకు ముప్పు పొంచి ఉంటుందని కొలాం హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సొనేరావ్ ఆరోపించారు. గురువారం ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని సల్పాలగూడ గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆదివాసీలు చట్టాలను, జీవోలను, రిజర్వేషన్లను తొలగించే ప్రమాదం ఉందన్నారు. అంతే కాకుండా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసి అగ్రవర్ణాలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల అభ్యర్థులను పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించి బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. ఆదివాసీల గొంతైనా ఉద్యమ నాయకుడు ఆత్రం సక్కు గెలిస్తే పార్లమెంట్‌లో ఆదివాసీ సమస్యలను లేవనెత్తే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలోని ఆదివాసీ కొలాంలు ప్రతి గ్రామంలో సమావేశాలు ఏర్పాటు చేసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సక్కు గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆదివాసీ నాయకులు కుమ్ర రాజు, రాము, తదితరులు ఉన్నారు.

వీసాల పేరిట మోసగిస్తున్న వ్యక్తుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్‌టౌన్: విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నకిలీ వీసాలు సృష్టించి పలువురిని మోసగించిన వారిని అరెస్ట్ చేసినట్లు నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఏపీకి చెందిన సీసాన రాజేశ్‌కుమార్ ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన స్నేహితుడు పెగ్గర్ల చంద్రశేఖర్ నిరుద్యోగ యువకులను విదేశాలకు పంపుతామని ఫేక్ వీసాలు సృష్టిస్తూ.. ఇవి నిజమని నమ్మించేందుకు ఆర్మీ ఆఫీసర్ గాడ్రెస్, నకిలీ స్టాంప్‌లు తయారు చేసి మోసాలు చేసేందుకు పథకం పన్నారు. ఈ క్రమంలో నిర్మల్ జిల్లాకు చెందిన సోన్, నిర్మల్, సారంగపూర్ యువకులు ప్రైవేట్ ఉద్యోగం కోసం కరీంనగర్‌లోని రేకుర్తిలో ఇల్లు అద్దెకు తీసుకున్నారు. అక్కడే అద్దెకు ఉండే సీసాన రాజేశ్‌కుమార్, చంద్రశేఖర్ వీరి ముగ్గురితో స్నేహం పెంచుకున్నాడు. వీరిని విదేశాలకు పంపుతామని నమ్మించారు. కరీంనగర్ నుంచి స్వస్థలానికి వచ్చిన వీరికి తరచూ ఫోన్ చేస్తూ వీసా ఇప్పిస్తామని ఫోన్ పే, బ్యాంక్ అకౌంట్ల ద్వారా నగదును తమ అకౌంట్లోకి పంపించుకున్నారు. కడ్తాల్ యువకుడి నుంచి రూ.1.25 లక్షలు, నిర్మల్ యువకుడి నుంచి రూ.70 వేలు, అలూర్ యువకుడి నుంచి రూ.70 వేలు తీసుకుని వీరికి ఫేక్ వీసాలు పంపించారు. దీంతో మోసపోయిన బాధితులు వీరిని సంప్రదించగా స్పందించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం సోన్ మండలం కడ్తాల్ జంక్షన్ వద్ద వీరిని అరెస్ట్ చేశారు. వీరి నుంచి 11 సిమ్ కార్డులు, ఆర్మీ డ్రెస్, బ్యాంక్ పాస్‌బుక్‌లు, చెక్ బుక్‌లు, రూ.2,500 నగదు, మొబైల్ ఫోన్, ప్రామిసరీ నోట్, పోర్జరీ వీసా జిరాక్స్ కాపీలను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన సోన్ సీఐ నవీన్‌కుమార్, ఎస్సై రవీందర్‌ను డీఎస్పీ అభినందించారు.

మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వాలు విఫలం

- తుడుం దెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేష్



నీటినల్లాలను ప్రారంభిస్తున్న తుడుం దెబ్బ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని బట్టి సావర్‌గాం శివారు ప్రాంతంలోని కుమరంభీం గూడలో నివాసం ఉంటున్న ఆదివాసులకు ఇంటి స్థలాల పట్టాలు, తాగునీరు, విద్యుత్, రోడ్డు సౌకర్యంతో పాటు ఇతర మౌలిక వసతులు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేష్ ఆరోపించారు. ఆదివాసీలు చందాలు వేసుకుని ఏర్పాటు చేసుకున్న నీటి నల్లాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమరంభీం గూడలో నివాసం ఉంటున్న వారికి కనీస మౌలిక వసతులు కల్పించాలని పలు ఉద్యమాలు చేసిన ప్రభుత్వాలు స్పందించడం లేదన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని దాహార్తిని తీర్చుకున్నేందుకు కూలీ పనులు చేసుకునే ఆదివాసీలు సొంతంగా బోరు బావులు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినప్పటికీ ఇప్పటికీ ఆదివాసీలు నివాసం ఉంటున్న చోట నీళ్లు, విద్యుత్, విద్య, వైద్యం, రోడ్డు రవాణా సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయని మండిపడ్డారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుకా, ఆదిలాబాద్ డివిజన్ అధ్యక్షుడు ఆత్రం గణపతి, మావల మండల అధ్యక్షుడు వెడ్మ ముకుంద్‌రావ్, నాయకులు ఆత్రం భుజంగరావ్, తొడసం ప్రకాష్, కుమ్ర గోవింద్‌రావ్, ఆత్రం శివ, బలిరాం ఉన్నారు.

రూ.1.33 లక్షలు స్వాధీనం



డబ్బులు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు



పట్టుకున్న నగదుతో ఎస్సై రజనీకాంత్

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మావల జాతీయ రహదారిపై గురువారం వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేని రూ.1.33 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిధర్, ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. వారి కథనం ప్రకారం.. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదిలాబాద్ రూరల్ సర్కిల్ పరిధిలో ప్రతి రోజు వాహనాలు తనిఖీలు చేస్తున్నామని, ఇదే క్రమంలో మావల సమీపంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేయగా ఇంద్రవెల్లికి చెందిన సంతోష్ రూ. 62వేలు, తిరుపతి రూ.71,500 నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేవన్నారు. వేర్వేరుగా వాహనాల్లో వెళ్తున్న వారి వద్ద నుంచి రూ.1,33,500 స్వాధీనం చేసుకోని సీజ్ చేసినట్లు తెలిపారు. ఆ నగదును వెంటనే ఎఫ్ఎస్‌టీ బృందం ద్వారా జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అందించినట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. రూ.50వేల కంటే ఎక్కువ నగదును తీసుకెళ్తే వాటికి సంబంధించిన పత్రాలు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలన్నారు. లేకుంటే ఆ నగదును స్వాధీనం చేసుకోని సీజ్ చేయనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో మావల పోలీసులు పాల్గొన్నారు.

నగదు పట్టివేత

కుంటాల: మండలంలోని కల్లూర్ 61 జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా నగదును పట్టుకున్నట్లు ఎస్సై వి.రజినీకాంత్ తెలిపారు. భైంసా నుంచి లోకేశ్వరం వైపు వెళ్తున్న ఓ వాహనంలో ఎలాంటి ఆధారాలు లేని రూ.63,500 సీజ్ చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలి

- డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి



డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: మావోయిస్టులు దళంను వీడి జనజీవన స్రవంతిలో కలవాలని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మావోయిస్టులు సాధించింది శూన్యమని, సాధించబోయేది కూడా ఏమీ లేదని, లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని పేర్కొన్నారు. మిగిలిన జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలని చెప్పారు. ఆదిలాబాద్ సబ్ డివిజన్ పరిధిలోని బోథ్ మండలం పొచ్చెరకు చెందిన మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్, బజార్‌హత్నూర్ మండలం డెడ్రా గ్రామానికి చెందిన దాసరివార్ సుమన అలియాస్ సీతక్కలు జనజీవనంలోకి రావడానికి పోలీసులు ఎళ్లవేళలా సహాయ సహకారాలు అందిస్తారని పేర్కొన్నారు. మావోయిస్టు దళ సభ్యుల కోసం వారి కుటుంబ సభ్యులు ఎంతగానో ఎదురుచూస్తున్నారని, కనీసం కుటుంబ సభ్యుల కోసమైన దళాన్ని వీడి జన జీవన స్రవంతిలో కలిసి ప్రశాంతమైన జీవనాన్ని గడపాలని విజ్ఞప్తి చేశారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం నుంచి లభించే అన్ని రకాల ప్రతిఫలాలను అందజేసి, పునరావాసం కల్పించే విధంగా పోలీస్‌శాఖ కృషి చేస్తుందని పేర్కొన్నారు. అడవుల్లో ఉండే గిరిజనులకు విద్య, వైద్యం, ఆర్థిక స్వావలంబన అందకుండా, వారి పురోగతికి, అభివృద్ధికి అడ్డుపడకుండా, ప్రభుత్వం కల్పించే పునరావాస కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మల్లన్న ఆలయంలో చోరీ

- హుండీ డబ్బులతో పాటు వెండి ప్రతిమలు అపహరణ..
- ఓ ఇంటి ఎదుట నిలిపి ఉంచిన ట్రాలీ ఆటో సైతం

దండేపల్లి: మండల కేంద్రంలో బుధవారం రాత్రి వేర్వేరుగా జరిగిన రెండు దొంగతనాలు కలకలం రేపాయి. గ్రామంలోని శ్రీమాల్గాం మల్లన్న ఆలయంలో రెండు రోజుల క్రితం వరకు మల్లన్న పట్నాలు, భోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. అక్కడ ఉన్న టెంట్ సామాన్లు తీసుకెళ్లడం కోసం టెంట్‌హౌజ్ సిబ్బంది గురువారం ఆలయం వద్దకు వచ్చే సరికి గుడి తలుపులు ఊడదీసి ఉన్నాయి. దీంతో వారు యాదవ సంఘం నాయకులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై స్వరూప్‌రాజ్ ఆలయం వద్దకు చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీంను రప్పించి వివరాలు సేకరించారు. దొంగలు గుడిలోకి చొరబడినా ఆలయంలోని రూ.18వేల విలువ చేసే 30 తులాల వెండి ప్రతిమలు, హుండీని ఎత్తుకెళ్లారు. ఖాళీ హుండీని ఆలయ సమీపంలో పొలంలో పడేశారు. ఇటీవల ఆలయం వద్ద పట్నాలు వేడుకలు నిర్వహించడంతో, భక్తులు హుండీ ద్వారా కానుకలు సమర్పించారు. అందులో సుమారుగా రూ.50వేల వరకు ఉంటాయని యాదవ సంఘం పెద్దలు భావిస్తున్నారు. సంఘ నాయకుడు గొట్ల భూమన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇంటి ఎదుట నిలిపిన ఆటోట్రాలీ..

దండేపల్లికి చెందిన షేక్ హాజీ తన ఆటో ట్రాలీని బుధవారం రాత్రి ఇంటి ఎదుట నిలిపి ఉంచాడు. గురువారం ఉదయం లేచి చూసే సరికి ఆటో ట్రాలీ కనిపించలేదు. దీంతో అతను వెంటనే దండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపారు. దొంగల కోసం గాలిస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

దొంగతనం కేసులో నలుగురికి రిమాండ్

నెన్నెల: కోనంపేటలో దొంగతనానికి పాల్పడిన నలుగురిని గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుల్దీన్, నెన్నెల ఎస్సై ప్రసాద్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు వివరాలు వెల్లడించారు. వేమనపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మాడె సుగుణాకర్ అలియాస్ రాము, దర్గం రాజబాబులు కోనంపేటకు చెందిన గొల్లపల్లి మహేష్, రాంటెంకి బన్ని జల్సాలకు అలవాటుపడి దొంగతనాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. మార్చి 24న రాత్రి కోనంపేటలో దుర్గం రాజారాం కిరాణషాపులోకి దూరి పది గ్రాముల రెండు బంగారు ఉంగరాలు, రూ.30వేల నగదు, మొబైల్ ఫోన్ దొంగలించారు. దొంగలించిన ఫోన్‌లో సుగుణాకర్ తన సిమ్ వేసి దానికి లాక్ ఉండటంతో మళ్లీ స్విచ్ఛాప్ చేయగా, సాంకేతిక పరిజ్ఞానంతో వారిని పట్టుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారు.

గని ప్రమాదంలో కార్మికుడికి గాయాలు

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిఖని గనిలో గురువారం ప్రమాదం జరిగి ఓ జనరల్ మజ్దూర్ కార్మికుడికి గాయాలయ్యాయి. కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం... గోడల శివకుమార్ అనే జనరల్ మజ్దూర్ జనరల్ షిఫ్ట్‌లో విధులకు హాజరయ్యాడు. భూగర్భంలో దిగి 47 లెవల్ మ్యాన్ రైడింగ్ కరువు స్టేషన్ వద్ద పనిచేస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. 43 లెవల్ చైర్‌లిఫ్ట్ స్టేషన్‌కు వచ్చే క్రమంలో జామ్ అయింది. ఆ చైర్ లిఫ్టును వేరు చేస్తుండగా ప్రమాదం చోటు చేసుకుని శివకుమార్ కుడి చేతి రెండు వేళ్ల చివరి భాగాలు తెగిపోయాయి. తీవ్ర రక్త స్రావం కాగా అతడిని అంబులెన్స్‌లో ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం గోదావరి ఖని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా

- బీజేపీ ఎంపీ అభ్యర్థి గేడం నగేష్



మాన్యాపూర్‌లో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి నగేశ్

నార్నూర్: ఎంపీగా అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని బీజేపీ ఎంపీ అభ్యర్థి గేడం నగేష్ అన్నారు. గురువారం మండలంలోని మాన్యాపూర్ గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామ పటేల్ మెస్రం రూప్‌దేవ్‌తో కలిసి గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీగా అవకాశం కల్పిస్తే ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన గ్రామాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రయత్నం చేస్తానన్నారు. గతంలో ఎమ్మెల్యేగా చూశారు. ఒక్కసారి ఎంపీగా అవకాశం ఇవ్వండని, కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశ అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచిందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట నాయకులు రమేష్ రాథోడ్, రాయిసీడం రూప్ దేవ్, గ్రామస్తులు ఉన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి

నేరడిగొండ: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గొడం నగేష్ అన్నారు. గురువారం మండలంలోని నారాయణపూర్, బంధం, బుర్కపల్లి, యాపల్‌గూడ, గుత్పాల, రోల్‌మామడ, కిష్టాపూర్, లఖంపూర్ రాయిసెంటర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో బోథ్ ఏఎంసీ మాజీ చైర్మన్ తిత్రే నారాయణసింగ్, బీజేపీ నాయకులు కోట్నాక్ కోటేశ్వర్, ఏరు రాజేశ్వర్, మండాడి భీంరావు, కృష్ణ, సాబ్లే సంతోష్ సింగ్, సురేష్, ఉత్తమ్ పాల్గొన్నారు.